క్లుప్తంగా

రైవాడ కెనాల్‌లో నాచు తొలగింపు



కొరువాడ కెనాల్‌లో నాచు, మొక్కలు తొలగిస్తున్న లస్కర్లు

కె.కోటపాడు: రైవాడ కెనాల్ మార్గంలో నాచు, పిచ్చి మొక్కల తొలగింపు పనులను జీవీఎంసీ లస్కర్లు చేపడుతున్నారు. రోజూ విశాఖ నగరానికి రైవాడ జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీరు కెనాల్ ద్వారా వెళ్తోంది. ఈ క్రమంలో నీటి అడుగు భాగంలో నాచు, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో ప్రవాహ వేగం తగ్గుతోంది. ఈ మేరకు జీవీఎంసీ సిబ్బంది ఆదివారం లస్కర్లతో కొరువాడ–ఉగ్గినవలస గ్రామాల మధ్య కెనాల్ మార్గంలో నాచు, మొక్కలను తొలగించే పనులను చేపడుతున్నారు.

సేవకు గుర్తింపుగా సత్కారం



శ్రీలక్ష్మిహయగ్రీవ స్వామి ఆలయంలో నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

నాతవరం: చెర్లోపాలెం పంచాయతీ శివారు పార్వతీపురం గ్రామానికి చెందిన మాకిరెడ్డి నాగేశ్వరరావు సేవలకు గుర్తింపుగా ఘన సత్కారం లభించింది. నెల్లూరు జిల్లాలో శ్రీలక్ష్మిహయగ్రీవ స్వామి ఆలయంలో కొంతకాలంగా ఆయన పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆదివారం సింహాచలం శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నుంచి 500 లడ్డూలు తీసుకెళ్లి శ్రీలక్ష్మిహయగ్రీవస్వామి దేవస్థానంలో భక్తులకు పంచిపెట్టారు. తరచూ ఇక్కడకు వస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వీటిని గుర్తించి నెల్లూరు హయగ్రీవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి కమిటీ సఘనంగా సత్కరించింది.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

రావికమతం: టీడీపీ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు తన స్వగ్రామం దొండపూడిలో ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పార్టీలకతీతంగా తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం దొండపూడి నుంచి చోడవరం వరకు బైక్ ర్యాలీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజు, నాయకులు బత్తుల తాతయ్యబాబు, రాజాన కొండ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మారికమ్మ తల్లి తీర్థం

దేవరాపల్లి: తామరబ్బ పంచాయతీ శివారు చిన సోంపురంలో మారికమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. తీర్థాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక, రేలా రే రేలా జానపద కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

డిపాజిట్‌దారులకు మెరుగైన వడ్డీ

రోలుగుంట: డిపాజిట్‌దారులకు తమ బ్యాంకు నుంచి మెరుగైన వడ్డీ ఇస్తున్నట్టు స్థానిక ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ నందిని సాహు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ పౌరులకు 444 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీం కింద 7.10 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 7.6, 777 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీం కింద సాధారణ పౌరులకు 7.50 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8.0 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. అన్ని బ్యాంకుల కన్నా అతి తక్కువ వడ్డీ రేటు 8.45 శాతం, బంగారు ఆభరణాలపై ఒక గ్రాముకు రూ. 3,550 చొప్పున 9.0 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రావికమతం: కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో డీఈఈ జి.సురేష్ బాబు ఆదివారం తెలిపారు. కొత్తకోట సబ్ స్టేషన్ అప్‌గ్రేడ్ మరమ్మతులు చేస్తున్న కారణంగా సరఫరా ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉండబోదన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యం

నాతవరం: సమాజంలో దళితులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే, ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే సాధ్యపడుతుందని విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూవో, దళిత కులాల సంక్షేమ సేవా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జల్లూరి ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులకు పుస్తకాలు, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, చదువు లేకపోతే ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించడం కష్టతరమన్నారు. మార్పులకు అనుగుణంగా దళితులు ముందుకు సాగాలన్నారు. విద్య ఉంటే సాధించలేనిదంటూ ఏమి ఉండదన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన విధంగా ప్రోత్సాహం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పేద విద్యార్థులకు పుస్తకాలు, ఇతర



హాస్టల్ విద్యార్థినులతో విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూవో ప్రసాదరావు, దళిత జేఏసీ నాయకులు

సామగ్రి అందచేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యులు చెక్కా ప్రభావతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు చెక్కా జోగిరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిట్ల చలపతిరావు, వార్డెన్ వరలక్ష్మి, నర్సీపట్నం దళిత జేఏసీ నాయకులు బోసి అప్పారావు, సహదేవుడు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఒడ్డు పండగ

- 101 ఘటాలతో ఊరేగింపు



మాడుగులలో ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం ఒడ్డు పండగ నిర్వహించారు. మాడుగులకు చెందిన పాలకుర్తి సత్యారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 101 ఘటాలతో భక్తులు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం



కశింకోట వీధుల్లో రథంపై గౌరమ్మ ఊరేగింపు



శారదానదిలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దనున్న ఆలయం నుంచి గౌరమ్మను రథంపై దాడి వారి వీధి, గవరపేట మధ్య వీధి, పెద్దగుమ్మం వద్ద శారదానది ఒడ్డు వరకు ఊరేగించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై రథాన్ని తాడుతో ముందుకు లాక్కుంటూ వెళ్లారు. ఆర్కెస్ట్రా పాటలు, బాణసంచా కాలుస్తూ ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు అమ్మ వారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం నది ఒడ్డున గౌరమ్మకు వేద మంత్రాల నడుమ పూజలు చేసి సంప్రదాయంగా నదిలో నిమజ్జనం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఉత్సవంలో అంధులు పలుచోట్ల పాడిన పాటలు ఆహూతులను అలరించాయి. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, వేగి దొరబాబు, బీశెట్టి ఆనంద్, కోయిలాడ నాగు, తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. సీఐ రవికుమార్, ఎస్‌ఐలు ఎ.ఆదినారాయణరెడ్డి, జె.నాగేశ్వరరావు బందోబస్తు పర్యవేక్షించారు.

మిత్రుడికి పూర్వ విద్యార్థుల సాయం

కశింకోట : కశింకోటలో అనారోగ్యంతో కాలు పోగొట్టుకున్న మిత్రునికి సహచర పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించి, అండగా నిలిచారు. సుమారు 40 ఏళ్ల క్రితం(1982–83 టెన్త్ బ్యాచ్) కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న తమ సహచర విద్యార్థి కుండల అప్పలనాయుడు కాలు పోగొట్టుకున్న విషయం, కుటుంబ పరిస్థితి తెలుసుకుని అతనికి అండగా నిలవాలని మిత్రులు నిర్ణయించుకున్నారు. తమ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులతో మాట్లాడారు. వారంతా సేకరించిన రూ.70 వేలు నగదును అందించి, ఏదైనా చిరు వ్యాపారం చేసుకోవాలని సూచించారు. అలాగే రూ.5 వేల విలువైన వంట సామగ్రి అందించి తమ స్నేహాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రభాకర్, సీహెచ్‌వీఎస్ఎస్ రాజు, డి.సత్యారావు, సత్యకుమార్, అచ్చయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అప్పలనాయుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తిమ్మరాజుపేటలో పూర్వ విద్యార్థులు



పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి,తిమ్మరాజుపేట గ్రామాల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986–87లో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం వాడ్రాపల్లిలోని పారివల్లెమ్మ గుడి వద్ద నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు ఆట పాటలతో గడిపారు. వెలగా సురేష్‌కుమార్, ఎ.వి.ఎస్.మూర్తి, దాడి రమణబాబు, బి.ఎం.నాయుడు తదితరుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఇదే బ్యాచ్‌కు చెందిన కాండ్రేగుల జగదీష్‌ను ఘనంగా సత్కరించారు. తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మునగపాక హైస్కూల్‌లో 1989–90లో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశమయ్యారు. బొడ్డేడ రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెలగా శ్రీనివాసరావు,మోటూరు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ పైపులైన్ల పనులపై మత్స్యకారుల ఆగ్రహం

అచ్యుతాపురం(అనకాపల్లి):పూడిమడక తీరంలోకి బ్రాండిక్స్ యాజమాన్యం రెండో పైపు లైన్ వేయడం సరికాదని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పూడిమడకలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బ్రాండిక్స్ యాజమాన్యం తీరును వారు నిరసించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హుద్‌హుద్ తుపాను సమయంలో ధ్వంసమైన పైపు లైన్ల స్థానంలో కొత్తవి అమరుస్తున్నామని బ్రాండిక్స్ యాజమాన్యం చెబుతోందని, దానిలో వాస్తవం లేదన్నారు. రెండవ పైపులైన్లు వేస్తున్నారని తెలిపారు. బ్రాండిక్స్ పైపులైన్ల వల్ల చేపలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. మొగ వద్ద నుంచి ఉప్పుటేగల్లీల వరకూ ప్రవహించే ఏరులో చేపలు కూడా మరణిస్తున్నాయని తెలిపారు. బ్రాండిక్స్ యాజమాన్యం పెండింగ్ ప్యాకేజీలను వెంటనే అందజేయాలని లేకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న మత్స్యకారులు

'స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలి'

అనకాపల్లి రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాళ్ల లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించి కార్మికుల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదాలు జరిగినపుడు అధికార యంత్రాంగం హడావుడి చేయడం తప్ప, ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడడంలో విఫలమవుతున్నారని ఆక్షేపించారు. ప్రమాద సంఘటనలకు కొందరు అధికారుల నిర్లక్ష్య వైఖరి కూడా కారణమేనని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పక్కాగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా రోడ్డు మలుపులు



ఆర్.వై.అగ్రహారం మార్గంలో ప్రమాదకరమైన మలుపు

కె.కోటపాడు: ఆర్.వై.అగ్రహారం– వారాడ గ్రామాల మధ్య మార్గంలో ప్రమాదకర మలుపులు దర్శనమిస్తున్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య పలు ప్రాంతాల వద్ద మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ఒక్కసారిగా ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మలుపుల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తాగునీటి బావి చప్టాకు మరమ్మతులు



చప్టా బాగు చేయిస్తున్న దృశ్యం

రావికమతం: కవగుంటలో మంచినీటి బావి చప్టా సుందరంగా తయారైంది. గ్రామస్తులు ఇప్పటికీ బావినీటిని ఉపయోగిస్తుంటారు. ఈ నీరు తీయడానికి ఏదైనా శుభకార్యాల సమయంలో ట్యాంకర్లతో సహా పలు గ్రామాల ప్రజలు తరలిస్తుంటారు. కొన్నాళ్లుగా బావి చప్టా మరమ్మతులకు గురవ్వడంతో పంచాయతీ నిధులు కేటాయించారు. సర్పంచ్ సూర్యకుమారి భర్త వరహాలు ఆదివారం మరమ్మతులు చేయించారు.

కుసుమ హరనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయం వద్ద కుసుమ హరనాథ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు నుంచి సోమవారం ఉదయం ఐదు గంటల వరకు ఏకాహం కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లికి చెందిన కుసుమ హరినాథ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్‌తో చిన్నారులకు పఠనాసక్తి



పిల్లలకు పఠనాసక్తిని పెంపొందిస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి

నర్సీపట్నం: పిల్లలకు విద్యపై ఆసక్తిని పెంపొందించేందుకు చిల్డ్రన్స్ క్లబ్ దోహదపడుతుందని గ్రంథాలయ అధికారి పి.దమయంతి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చిల్డ్రన్స్ క్లబ్‌కు పిల్లలు విచ్చేశారు. ఇటీవల వచ్చిన కొత్త పుస్తకాలను పిల్లలకు పరిచయం చేశారు. పిల్లల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు మెమరీ గేమ్ నిర్వహించారు. పిల్లలు విధిగా గ్రంథాలయానికి రావాలన్నారు. ఇక్కడ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు లక్షల పుస్తకాలు ఉన్నాయన్నారు.

కొనసాగిన నేవీ నిర్వాసితుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా ఆదివారం 105 రోజు కొనసాగింది. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, వాడపాలెం, నేవీ పునరావాస కాలనీ, గోవిందపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు ఓటర్ల జాబితాలు సిద్ధం



ఓటర్ల జాబితాపై పంచాయతీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: మండలంలో దేవవరం ఎంపీటీసీ సెగ్మెంట్‌తో పాటు, రేబాక, చినదొడ్డిగల్లు గ్రామాల్లో ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. దేవవరం పంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. గత ఎన్నికల్లో ఈ గ్రామ ఎంపీటీసీగా గొర్ల రాఘవకుమారి వైఎస్సార్‌సీపీ తరపున విజయం సాధించారు. అంతకుముందు ఎన్నికల్లో ఆమె సర్పంచ్‌గా కూడా గెలవడంతో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఈ ఎన్నికకు సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించేందుకు గాను జాబితా సిద్ధం చేశారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితా కలెక్టర్ ఆమోదానికి పంపించిన తర్వాత ఆయన అనుమతితో మార్చి 2వ తేదీన ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. రేబాక, చినదొడ్డిగల్లులో రెండు వార్డు సభ్యుల పదవులకు కూడా ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, వాటి ఓటర్ల జాబితాలు కూడా సిద్ధం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏ.కోడూరులో వచ్చే నెల నిర్వహించే భారీ రక్తదాన శిబిరం పోస్టర్‌ను తారువ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విడుదల చేశారు. యువకులంతా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున్, సూరెడ్డి బాబూరావు, సభ్యులు బొబ్బిలి సన్యాసిరావు, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, బండారు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ

చీడికాడ: ప్రకృతి వ్యవసాయంతో అటు నేలకు, ఇటు రైతులకు ఆరోగ్యదాయకమని ప్రకృతి వ్యవసాయాధికారి ఐసీఆర్పీస్ ఎం.టి నాగమణి తెలిపారు. ఆదివారం అర్జునగిరిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతులు ముందుకువచ్చి సేంద్రియ విధానంలో పంటలు పండించాలని కోరారు. ఖరీఫ్‌కు ముందు నవధాన్యాల సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుందని సూచించారు. సర్పంచ్ బి.రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి సాగు కోసం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్జునగిరి బస్టాండ్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జీడితోటలకు సస్యరక్షణ చర్యలు



జీడితోటల్లో పూత రక్షించుకునేందుకు సస్యరక్షణ చేస్తున్న యజమానులు

రోలుగుంట: జీడితోటల సంరక్షణ పనుల్లో యజమానులు నిమగ్నమయ్యారు. వరి, చెరకు తర్వాత జీడితోటలే రైతులను ఆదుకుంటున్నాయి. మండలంలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో జీడితోటలున్నాయి. ఏటా జనవరి నుంచి పూత ప్రారంభమై ఫిబ్రవరిలో పిందెలు వేసి, ఈ నెలాఖరులో కాపుకు వస్తాయి. ఈ నేపథ్యంలో పొగమంచు దెబ్బకు పిందెలు, పూత రాలిపోకుండా ఉద్యానవన శాఖాధికారుల సూచనలతో వడ్డిప, రోలుగుంట, కొమరవోలు తదితర గ్రామాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది పూత బాగుండటంతో అధిక దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

16 నుంచి కామాక్షిదేవి ఆలయ వార్షికోత్సవాలు

- 18న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీ కామాక్షిదేవి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు ఆలయ వార్షికోత్సవాలు, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 29వ ఆరాధన, మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పట్టణ కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు అన్నారు. కామాక్షిదేవి ఆలయంలో ఉత్సవ కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న గవరపాలెం కామాక్షమ్మ ఆలయం నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం బయలుదేరుతుందన్నారు. పట్టణంలోని పురవీధులగుండా స్వామివారిని ఊరేగించి విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నున్న స్వామివారి గుడిలో వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. 19న స్వామి వారి ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మధరావు, గౌరవాధ్యక్షుడు ఎండపల్లి మోహన్ బ్రహ్మజీ, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పరవాడ: పరవాడ–గాజువాక రహదారిలో స్థానిక బాలికల వసతి గృహం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.రాంబాబు(35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. స్థానిక జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న రాంబాబు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై పరవాడ నుంచి కాలనీకి వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పడంతో వసతి గృహం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని యువకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

సూర్యనారాయణమూర్తి ఉత్సవ విగ్రహ ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయానికి కశింకోట మండలం గవరపేట వీధికి చెందిన వేగి దొరబాబు దంపతులు సూర్యనారాయణమూర్తి ఉత్సవ విగ్రహాన్ని దేవాలయ చైర్మన్ కొణతాల బాబూరావు చేతుల మీదుగా ఆదివారం అందించారు. ఈ ఉత్సవ విగ్రహాన్ని రాజుపాలెం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రూ.80 వేలుతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాన్ని ఆలయానికి అందించిన దొరబాబు దంపతులను అభినందించారు. స్వామివారి ఊరేగింపులో తోడపెద్దుసేవ, కోలాటం, తప్పెటగుళ్లు, సన్నాయి మేళాలతో స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయం అర్చకులు దొడ్డిపట్ల కళ్యాణ్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి రామకృష్ణ ప్రసాద్, గొల్లవిల్లి నర్సింగరావు, బండారు వెంకటరమణ, చిరంజీవి, గుర్రం సత్యారావు, ఆదిబాబు, నగిరెడ్డి రాంబాబు, మామిడి సూరిబాబు, భక్తులు పాల్గొన్నారు.



రాజుపాలెం వీధుల్లో ఉత్సవ విగ్రహ ఊరేగింపు

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

మునగపాక: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ కోరారు. వాడ్రాపల్లిలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు, కరపత్రాల పంపిణీ నిర్వహించారు.